క్లుప్తంగా

అన్నిరకాల వరికి బోనస్ ఇవ్వాలి

పాన్‌గల్: రైతులు పండించే అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని రైతు సంఘం జిల్లా నాయకులు కోదండరాములు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బాల్యానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మాట నిలబెట్టుకోవాలన్నారు. సన్న వడ్లకే ప్రభుత్వం బోనస్ ప్రకటించనున్నట్లు వస్తున్న వార్తలపై రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. రాష్ట్రంలో పండించే వరి ధాన్యంలో ఎక్కువ శాతం దొడ్డు వడ్లనే పండిస్తున్నారన్నారు. దొడ్డు వడ్లను పండించే వారిలో అధిక శాతం సన్న, చిన్నకారు రైతులే ఉంటారన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు.

మినీ ట్యాంకుల నిర్మాణానికి అధికారుల పరిశీలన



వీపనగండ్ల: మండలంలోని కల్వరాల్లలో శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం శుక్రవారం అధికారులు గ్రామంలో పర్యటించి ట్యాంకుల నిర్మాణ స్థలాలను పరిశీలించారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో గ్రామంలోని ఎత్తైన ప్రదేశాలకు తాగునీరు అందడం లేదని ఈ సమస్యను అధిగమించేందుకు మినీ ట్యాంకుల నిర్మాణాన్ని చేపట్టాలని గ్రామంలోని యువకులు నర్సింహ, వెంకట్, రాజయ్య తదితరులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉదయ్, పంచాయతీ కార్యదర్శి కుర్మన్న పాల్గొన్నారు.

కాల్వలో జమ్ము తొలగించండి



పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో బీమా కాల్వలో ఏపుగా ఉన్న జమ్ము గడ్డిని తొలగించాలని ఆ గ్రామ రైతులు కోరుతున్నారు. వర్షాకాలం ప్రారంభమై కాల్వ ద్వారా సాగునీరు విడుదల చేస్తే కాల్వలో పేరుకుపోయిన జమ్ము తొలగించడం ఇబ్బందిగా మారుతుందన్నారు. సాగునీరు విడుదలకు ముందుగానే జమ్ము గడ్డిని తొలగిస్తే కాల్వ ద్వారా సాగునీరు సాఫీగా పారుతుందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాల్వలోని జమ్ము గడ్డిని తొలగించేందుకు తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సీతారాములవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



కల్వకుర్తిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని జయప్రకాష్‌నగర్ తండాలో వెలిసిన పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. మొదటిరోజు పూజాహోమం, వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కౌన్సిలర్ హమ్లి, దేవస్థానం చైర్మన్ హనుమానాయక్, మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి చక్రం వితరణ



నాగర్ కర్నూల్: జిల్లా కేంద్రంలోని ఓంనగర్ కాలనీ అభయ హనుమాన్ దేవాలయంలో సంతోషిమాత అమ్మవారికి శుక్రవారం హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన బచ్చు బుచ్చయ్య, పుష్పమ్మ దంపతులు కిలో వెండి చక్రం వితరణ చేశారు. అమ్మవారికి అభిషేకం, విశేషాలంకరణ, కుంకుమార్చన, కలశంపూజ, ఉద్యాపనం, ఒడిబియ్యం, మహా ప్రసాదాల నివేదన, మహామంగళహారతి, ఊయ్యాల సేవ, పావలింపు సేవలను ఆలయ ప్రధాన అర్చకులు అల్లాడి ప్రకాష్ శర్మ వేదమంత్రోచరణాల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సరస్వతి, శ్రీనివాసులు, వేణుగోపాల్ రావు, మలిపెద్ది భాగ్యమ్మ, పెద్దమారూర్ రాజేశ్వరి, రాచర్ల శివకుమార్, భక్తులు పాల్గొన్నారు.

నిర్మించి.. వదిలేశారు

- అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన గోపల్‌దిన్నె రిజర్వాయర్ విశ్రాంతి భవనం
- పట్టించుకోని ఉన్నతాధికారులు



ధ్వంసమైన శిలాఫలకం



నిరుపయోగంగా ఉన్న గోపల్‌దిన్నె రిజర్వాయర్ విశ్రాంతి భవనం

వీపనగండ్ల: రైతుల ప్రయోజనం కోసం అధికారులు రూ.లక్షలు ఖర్చు చేసి సాగునీటి వసతులు కల్పించారు. కాల్వల ద్వారా విడుదలవుతున్న నీటి నిర్వహణకు రైతులను చైతన్యపరిచేందుకు, రైతులకు ఉపయోగకరంగా ఉండేందుకు గోపల్‌దిన్నె రిజర్వాయర్ విశ్రాంతి భవనాన్ని నిర్మించారు. నిర్మించిన భవనాన్ని నిర్లక్ష్యంగా వదిలేయడంతో మందు, జూదరులకు నిలయంగా మారింది. ఈ విషయమై అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నోమార్లు విన్నవించినా.. లాభం లేకుండా పోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, అవసరమైన మరమ్మతులు చేయించి భవనాన్ని వినియోగంలో తీసుకురావాలని అన్నదాతలు కోరుతున్నారు.

లస్కర్‌లకు వసతులు లేక..

గోపల్‌దిన్నె రిజర్వాయర్ మొదలుకొని అవుట్‌ఫాల్ గేట్‌ల నుంచి డిఫాటి వరకు ఉన్న వివిధ డిస్ట్రిబ్యూటర్ల నిర్వహణ కోసం ఎంతో మంది లస్కర్‌లు పని చేస్తున్నారు. లస్కర్‌లకు కనీస వసతులు లేకపోవడం, అవసరమైన పరికరాలను భద్రపర్చుకోవడం కోసం కనీస వసతులు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే మూడు మండలాల్లోని 40 గ్రామాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా గోపల్‌దిన్నె ఫిల్టర్ బెడ్స్ నుంచి తాగునీరు అందిస్తున్న సిబ్బందికి కూడా సరైన వసతులు లేవు. ఫిల్టర్ బెడ్స్‌కు అతి సమీపంలోని విశ్రాంతి భవనాన్ని వినియోగంలోకి తీసుకొస్తే సిబ్బందికి ఉపయోగకరంగా ఉంటుంది.

మందుబాబులకు నిలయంగా..



రూ.10 లక్షలు ఖర్చుచేసి విశ్రాంతి భవనాన్ని నిర్మించిన అధికారులు భవనానికి అమర్చిన కిటికీలు, తలుపులను ఎత్తుకెళ్లారు. విశ్రాంతి భవనంలో మందుబాబులు, జూదరులు అసాంఘిక కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకొస్తే ప్రయోజనం..



రైతుల అవగాహన కోసమే కాకుండా లస్కర్లు, ఫిల్టర్ బెడ్ సిబ్బందికి విశ్రాంతి గదిని వినియోగంలోకి తీసుకొస్తే ప్రయోజనం కలుగుతుంది. మందుబాబుల ప్రవర్తన తీరుతో మహిళా రైతులు అటు వైపు వెళ్లేందుకు భయపడుతున్నారు. అధికారులు స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలి.

– శ్రీనివాసులు, మాజీ సర్పంచ్, గోపల్‌దిన్నె

మరమ్మతులకు నిధులు కేటాయించాలి



గోపల్‌దిన్నె రిజర్వాయర్ నిర్వహణ కోసం ఉన్నతాధికారులు తరచూ వస్తుంటారు. విశ్రాంతి భవనం వినియోగంలోకి తీసుకొస్తే అధికారులతో పాటు రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. కొద్దిపాటి మరమ్మతులు చేసి గోపల్‌దిన్నె రిజర్వాయర్ విశ్రాంతి భవనాన్ని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలి.

– అంజనేయులు, రైతు వీపనగండ్ల

ఉన్నతాధికారులకు నివేదిస్తాం..



రిజర్వాయర్ విశ్రాంతి భవనాన్ని వినియోగంలోకి తీసుకొస్తే అధికారులకు, రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. భవన మరమ్మతుల నిర్మాణం కోసం అవసరమైన నిధులకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తాం.

– ప్రభు, జూరాల ఏఈ, పెబ్బేరు ప్రాజెక్ట్

ఘనంగా బ్రహ్మంగారి ఆరాధనోత్సవం



కొత్తకోట సమీపంలోని బ్రహ్మంగారి ఆలయంలో ఆరాధనోత్సవంలో పాల్గొన్న విశ్వబ్రాహ్మణులు

కొత్తకోట రూరల్: పట్టణ సమీపంలోని బ్రహ్మంగారి ఆలయంలో వీరబ్రహ్మేంద్రస్వామి 331వ ఆరాధనోత్సవాన్ని శుక్రవారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు మాట్లాడారు. సర్వమత సమ్మేళనం ధ్యేయంగా, కులమతాలకు అతీతంగా అందరి మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో వెంకటయ్యచారి, విశ్వమోహన్, నాగరాజుచారి, వెంకటేష్ చారి, కృష్ణయ్యచారి, సురేంద్రచారి, రమేష్, అరుణ్ కుమార్, విజయ్, రఘు తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో వీర బ్రహ్మేంద్ర స్వామి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

వనపర్తిటౌన్: పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 331వ జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో టీజేఏసీ ఆధ్వర్యంలో వీరబ్రహ్మం చిత్రపటానికి ఆరాధన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కలియుగంలో కుల వివక్ష నశించిపోతుందని, కులాంతర వివాహాలు జరుగుతాయని, సమాజంలో లింగ సమతా భావన పెరుగుతుందని వీరబ్రహ్మం కాలజ్ఞానం ద్వారా ప్రపంచానికి చాటి చెప్పారని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్ ప్రకాశ్ తెలియజేశారు. కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, డాక్టర్ నరసింహ శర్మ, నాయకులు గంధం నాగరాజు, డాక్టర్ శ్రీనివాస రెడ్డి, కర్ణాకర్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల పూర్తికి సహకరించాలి

కల్వకుర్తిరూరల్: పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేసేందుకు సంపూర్ణ సహకారం అందించాలని కల్వకుర్తి ఎత్తిపోతల పథకం సాధన రైతు జేఏసీ కన్వీనర్ బండెల రామచంద్రారెడ్డి కోరారు. శుక్రవారం రాష్ట్ర నీటి పారుదల శాఖ సలహాదారుడిగా ప్రభుత్వం నియమించిన రిటైర్డ్ ఎస్సీ నల్లవెల్లి రంగారెడ్డిని ఆయన కలిసి సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. గతంలో పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టుల నిర్మాణం కోసం రంగారెడ్డి చేసిన కృషిని ఆయన కొనియాడారు. రాబోయే రోజుల్లో పాలమూరు, రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందుబాటులోకి వచ్చేవిధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఈర్ల నర్సింహ్మకు ఘన నివాళి



బిజినేపల్లి: సీపీఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈర్ల నర్సింహ్మ మొదటి వర్ధంతిని శుక్రవారం మండలంలోని వెల్గొండలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు ఆయన స్తూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈర్ల నర్సింహ్మ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఈర్ల చంద్రమోళి, బాలరాంరెడ్డి, పెద్ద బాల్‌రెడ్డి, ఈర్ల భూపేష్‌బాబు, ఈర్ల గంగాధర్, అజయ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలకు గురవుతున్న డ్రెయినేజీలు



రాజీవ్ గాంధీ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు డ్రెయినేజీలపై నిర్మాణాలు ఇలా..

అమరచింత: మున్సిపాలిటీలోని ప్రధాన రహదారులకు ఇరువైపుల నిర్మించిన డ్రెయినేజీలు, ఆయా వార్డుల్లోని డ్రెయినేజీలు ఆక్రమణకు గురవుతున్నాయి. వాటిని మున్సిపల్ అధికారులు నివారించలేకపోతున్నారు. డ్రెయినేజీలపై స్లాబ్‌లు వేయడంతో పారిశుద్ధ్య కార్మికులు మురుగు తీసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటి నిర్మాణాలకు అనుమతి ఇస్తున్న మున్సిపల్ అధికారులు, ఇంటి నిర్మాణ సమయాల్లో ఇచ్చిన అనుమతి ప్రకారమే ఇంటి నిర్మాణాలు జరుగుతున్నాయా లేదా అనే విషయాలను తెలుసుకోలేకపోవడంతో యాథేచ్ఛగా డ్రెయినేజీలు కబ్జా చేసుకుంటూ ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు దృష్టి సారించి కాల్వలను ఆక్రమించుకొని నిర్మాణాలు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని పారిశుద్ధ్య కార్మికులు కోరుతున్నారు.

ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్ తొలగించండి

వీపనగండ్ల: మండలంలోని పుల్గర్‌చర్లలో ప్రధాన డబుల్ సీసీ రోడ్డుపై ఉన్న మినీ ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు రమేష్, బుడ్డమ్మ, సుంకలమ్మ, బాలస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. రూ.లక్షలు వెచ్చించి సీసీ రోడ్డును నిర్మిస్తున్న అధికారులు వాహనదారులకు, పసిపిల్లలకు ప్రమాదకరంగా ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షిత ప్రాంతానికి తరలించాలని కోరుతున్నారు.



పుల్గర్‌చర్లలో సీసీరోడ్డుపై ఉన్న మినీ ట్రాన్స్‌ఫార్మర్

రాధాకృష్ణకు ఘన నివాళి



రాధాకృష్ణ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

వనపర్తిటౌన్: వనపర్తి మున్సిపల్ 31వ వార్డు కౌన్సిలర్ బండారు రాధాకృష్ణ అకాల మృతి పుర ప్రజలకు తీరని లోటని మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ అన్నారు. ఇటీవల కౌన్సిలర్ రాధాకృష్ణ మృతిచెందడంతో శుక్రవారం పుర కార్యాలయంలో పార్టీలకు అతీతంగా రాధాకృష్ణ చిత్రపటానికి మున్సిపాలిటీ తరఫున నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాజకీయాల్లో రాణించాలన్నా, కౌన్సిలర్‌గా గెలవాలన్న డబ్బుతో కూడుకున్న వ్యవహారమని చాలా మంది భావిస్తారని, అలాంటి తరుణంలో డబ్బులు ఖర్చు పెట్టకుండా ప్రజలకు సేవ చేస్తారనే నమ్మకంతో రాధాకృష్ణను వార్డు ప్రజలు రెండుసార్లు గెలిపించారని గుర్తుచేశారు. రాధాకృష్ణ కుటుంబానికి సానుభూతి ప్రకటించారు. కార్యక్రమంలో కమిషనర్ పూర్ణ చందర్, మాజీ చైర్మన్ గట్టుయాదవ్, మాజీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్లు భువనేశ్వరి, అలేఖ్య, లక్ష్మీనారాయణ, వెంకటేష్, బండారు కృష్ణ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి



తెల్లరాళ్లపల్లితండాలో ఒండ్రుమట్టి తరలింపు పనులను పరిశీలిస్తున్న ఏపీఓ కుర్మయ్య

పాన్‌గల్: ఎండల తీవ్రత కారణంగా నర్సరీలో, హరితహారంలో నాటిన మొక్కలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని సంరక్షించాలని ఏపీఓ కుర్మయ్య అన్నారు. శుక్రవారం చెట్టు, చెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెంగళాయిపల్లి, తెల్లరాళ్లపల్లి, తెల్లరాళ్లపల్లితండా గ్రామాల్లో నర్సరీలను పరిశీలించి, రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు నీరు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మొక్కలకు క్రమం తప్పకుండా వాటర్ క్యూరింగ్ చేయాలన్నారు. ఆయా గ్రామాల్లో చెరువులో ఒండ్రుమట్టి తరలింపు, కాల్వల మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. పనులకు వచ్చే రోజు వారీ కూలీల సంఖ్యను పెంచాలని, పనుల వద్ద నీడ, నీటి వసతి తప్పక ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'గత, నేటి పాలనకు వ్యత్యాసం చూస్తారు'



మాట్లాడుతున్న పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయచందర్

వనపర్తిటౌన్: రైతులకు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని, రైతుల శ్రేయస్సు కోసం ఆగస్టు 15 లోపు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయచందర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే నివాసంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ వచ్చి ఐదు నెలలే అయ్యిందని, ఐదేళ్లు పూర్తయినట్లుగా బీఆర్‌ఎస్ ఆందోళనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం ధాన్యంపై బోనస్ ప్రకటన చేయకముందే ప్రకటన చేసినట్లుగా బీఆర్‌ఎస్ రాద్ధాంతం చేస్తుందని మండిపడ్డారు. గత పాలకుల పాలనకు, ఎమ్మెల్యే మేఘారెడ్డి పాలనలో జరిగే అభివృద్ధికి ఎంత వ్యత్యాసం ఉంటుందో ప్రజలు చూస్తారని చెప్పారు. ప్రతి పక్ష పార్టీగా నిర్మాణాత్మకమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని, రాజకీయ ఉనికి కోసం పాకులాడటం తగదన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ సీఎం రేవంత్ రెడ్డిని అసభ్య పదజాలంతో మాట్లాడటం సిగ్గుచేటని, ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ సమన్వయకర్త లక్కాకుల సతీష్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పకుంటే గట్టుయాదవ్‌పై కేసు నమోదు చేసి, న్యాయపరంగా శిక్ష పడేలా చూస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు బి.వెంకటేష్, చీర్ల సత్యం, నక్క రాములు, మన్నెంకొండ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



వడ్డెవాటలో క్రీడాకారులకు క్రికెట్ కిట్లు అందజేస్తున్న బీజేపీ మండల నాయకుడు వాకిటి రాజమౌళి

కొత్తకోట రూరల్: యువత క్రీడల్లో రాణించాలని బీజేపీ మండల నాయకులు వాకిటి రాజమౌళి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వడ్డెవాటలో యువకులకు క్రికెట్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవిలో యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉండేందుకు తన సొంత ఖర్చులతో మండలంలోని పలు గ్రామాల్లోని క్రీడాకారులకు క్రికెట్ కిట్లను అందజేశానన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడుతాయని, క్రీడల్లో రాణిస్తే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందన్నారు. శంకర్, వెంకటేష్, మహేష్, శేఖర్ పాల్గొన్నారు.

కూలిన ఇళ్లు.. నేలకొరిగిన చెట్లు





పిన్నంచర్లలో వర్షానికి దెబ్బతిన్న పెంకుటిల్లు, ఇంటి ముందు బాధిత కుటుంబ సభ్యులు

ఆత్మకూర్: ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి గురువారం రాత్రి మండల పరిధిలోని పిన్నంచర్లలో బోయనాగేష్ పెంకుటిల్లు కూలిపోయింది. ప్రభుత్వం ఇంటి నార్మాణానికి ఆర్థిక సాయం అందించాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు. సాయంత్రం తెల్లవారుఝాము వరకు వర్షం కురియడంతో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. రహదారులు బురదమయంగా మారాయి. చెట్లు నేలకొరిగాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

పెంట్లవెల్లిలో భారీ వర్షం



కొత్త బస్టాండ్ ప్రాంతంలో కురుస్తున్న వర్షం



రోడ్లపై పారుతున్న వర్షపునీరు

కొల్లాపూర్/ పెంట్లవెల్లి: మండలంలో శుక్రవారం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి మధ్యాహ్నం 3 నుంచి 4.30 గంటల వరకు పెంట్లవెల్లి, మంచాలకట్ట, జటప్రోల్, గోప్లాపూర్, కొండూరు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో పెంట్లవెల్లిలోని రహదారుల గుండా, కాలనీల్లో వర్షపు నీరు మోకాళ్లలోతులో రోడ్లపై పారింది. ఎన్నో రోజుల నుంచి విపరీతమైన ఎండలతో సతమతమైన ప్రజలు ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం కురవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అలాగే కొల్లాపూర్ పట్టణంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి.

తెరుచుకోని గ్రంథాలయాలు

- నిర్వహణ నిధులు లేక పట్టించుకోని పాలకులు



పట్టణంలో మూతపడిన గ్రంథాలయం

అమరచింత: పట్టణంలో కొన్ని సంవత్సరాలుగా గ్రంథాలయం మూత పడి ఉన్నా.. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో వాటిలోని పుస్తకాలు, గ్రంథాలు చదలు పడుతున్నాయి. మండలంగా ఏర్పాటు కాకముందే అమరచింతలో శాఖ గ్రంథాలయాన్ని నిర్వహిస్తూ.. పాఠకులకు దినపత్రికలతో పాటు కథల పుస్తకాలు, వివిధ రకాల నవల పుస్తకాలను అందుబాటులో ఉంచేవారు. మండలం ఏర్పడినప్పటి నుంచి గ్రంథాలయ నిర్వహణపై జిల్లా గ్రంథాలయ శాఖ దృష్టి సారించకపోవడంతో ఇప్పటికీ మూసిన తలుపులు మూసినట్టుగానే గ్రంథాలయ భవనం దర్శనమిస్తోంది. పట్టణంలోని కొంత మంది యువకులు, ఉపాధ్యాయులు, వివిధ రాజకీయ పార్టీల నాయకుల సహకారంతో గ్రంథాలయ ఆవశ్యకతను గుర్తించి చందాలతో కొన్ని సంవత్సరాలు గ్రంథాలయాన్ని కొనసాగించారు. మాజీ అడ్వకేట్ జనరల్, డీఎంఆర్ఎం ట్రస్ట్ చైర్మన్ దేశాయి ప్రకాష్ రెడ్డి బిల్డింగ్ అద్దెతో పాటు నిర్వాహకుడికి వేతనం అందిస్తూ వచ్చారు. కొంత కాలానికి భారం అధికమవ్వడంతో వెనుకడుగు వేశారు. దీంతో నాలుగు సంవత్సరాలుగా పట్టణంలో గ్రంథాలయం మూతపడి ఉంది. మున్సిపాలిటీ వచ్చిన తర్వాతనైనా.. గ్రంథాలయానికి మహర్దశ వస్తుందని ఆశపడిన పాఠకులకు నిరాశే మిగిలింది.

మూడు సంవత్సరాలుగా చెల్లింపులు లేవు..

మున్సిపాలిటీ ఏర్పాటు తర్వాత అధికారుల ఆదేశాల ప్రకారం పట్టణంలో గ్రంథాలయ నిర్వహణ కోసం ప్రతి సంవత్సరం ఇంటి పన్నుల వసూళ్లలో ఏడు శాతం వాటాను జిల్లా గ్రంథాలయ సంస్థకు పంపుతున్నారు. ఇలా మూడు సంవత్సరాలుగా మొదటి సంవత్సరం రూ.15 వేలు, రెండో సంవత్సరం రూ.45 వేలు, మూడో సంవత్సరం రూ.92 వేలను మున్సిపాలిటీ ద్వారా చెల్లించారు. ప్రస్తుత సంవత్సరం రూ.2.30 లక్షలు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారు. మున్సిపాలిటీ ద్వారా మేంటెనెన్స్ అందుకుంటున్న జిల్లా గ్రంథాలయ శాఖ మాత్రం కనీసం దినపత్రికలను సైతం అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేయలేకపోతుంది. పట్టణానికి చెందిన యువకుడిని పార్ట్‌టైం లైబ్రేరియన్‌గా నియమించుకున్న వేతనాలు ఇవ్వలేకపోవడంతో గ్రంథాలయ వ్యవస్థ మరుగున పడింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మూతపడిన గ్రంథాలయాన్ని తెరిపించాలని యువకులు కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం...



పట్టణంలో ఎన్నో సంవత్సరాలుగా గ్రంథాలయం మూతపడినా.. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. మున్సిపాలిటీ ద్వారా డబ్బులు తీసుకుంటున్నా.. జిల్లా గ్రంథాలయ శాఖ పట్టణంలో కనీసం దిన పత్రికలతోనైనా గ్రంథాలయాన్ని నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా గ్రంథాలయాన్ని వినియోగంలోకి తీసుకురావాలి.

– తౌఫిక్, అమరచింత